మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కెజిబివిల ముందు నిరసనను జయప్రదం చేయాలి



**మనూర్, నవంబరు 10, ప్రభాతవార్త:** ఈ నెల 15, 16వ తారీఖులలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ముందు టిపిటిఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు నిర్వహించే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని టిపిటిఎప్ జిల్లా కమిటి అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ సూచించారు. కెజిబివిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు పేర్కొన్నారు. 15, 16న జిల్లాలోని ఆయా మండలాల్లో గల కెజిబివి పాఠశాలల ముందు నిరసన, 26వ తేదీన జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోకి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, డిసెంబరు 3న డిఎస్ఇ టిఎస్ ముట్టడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి,మనూర్ మండల అధ్యక్షులు విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన ఏసీపీ దేవరెడ్డి

**నంగునూర్, నవంబర్ 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రాజగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌ను సిద్దిపేట ఏసీపీ చల్లా దేవరెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ జానకిరామ్‌రెడ్డితో కలిసి గురువారం తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో పోలీసుల విధి నిర్వహణ అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. ప్రతి యేడాది ఎఫ్ఐఆర్ రిజిస్టర్, రికార్డ్సు ప్రతి పోలీసు స్టేషన్‌లో పరిశీలించడం జరుగుతుందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అయన వెంట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, ఏఎస్ఐ కిషన్ పవర్, హెచ్‌సి రంగారెడ్డి తదితరులు ఉన్నారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

## కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు ఎన్నాళ్లు

### -రోడ్డెక్కి కన్నెర్ర జేసిన రైతన్నలు

**పాపన్నపేట, నవంబరు 10, ప్రభాతవార్త:** వరి కొనుగోలు కేంద్రాలకు తరలించిన వరి ధాన్యంను రైస్ మిల్లులకు తరలించేందుకు లారీల కొరత ఏర్పడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందని ఆందోళన చెందుతూ రైతులు కన్నెర్ర చేస్తూ రోడ్డెక్కిన సంఘటన మెదక్-బొడ్మట్‌పల్లి రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పాపన్నపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి లారీలను సమకూర్చకపోవడంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తూ ఆగమైపోతున్నా సంబంధిత అధికారులకు పట్టకపోవడం విడ్డూరంగా ఉందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై రైతులు గంట పాటు భైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో అటుగా వెళ్లే వాహనాలు ఎక్కడివి అక్కడే ఆగిపోవడంతో రోడ్డు జామ్ అయింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో దాన్యం స్వీకరించినా అక్కడి నుంచి మిల్లులకు తరలించేందుకు లారీల కొరత తీవ్రంగా ఉందని వాపోయారు. కొనుగోలు కేంద్రానికి నామమాత్రంగా ఒకటి,రెడు లారీలు పంపితే ధాన్యాన్ని మిల్లుకు ఎలా సరఫరా చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంను తూకం చేసి కొనుగోలు చేసినా మిల్లుకు తరలించకపోవడంతో ధాన్యం ఎక్కడ పాడవుతుందో అని, వర్షం వస్తే ధాన్యం పడవుతుందని రైతులు బెంగ పడుతున్నారు. రైతులు రోడెక్కిన విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని చరవాణిలో లారీలు సరఫరా చేసే గుత్తేదారుతో మాట్లాడి రైతులు ధర్నాను విరమించేలా చేశారు. లారీల కొరత విషయమై గుత్తేదార్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా రైస్ మిల్లులకు ధాన్యంతో వెళ్లిన లారీల్లోని ధాన్యాన్ని ఖాళీ చేయించడంలో రైస్‌మిల్లు యజమానులు విఫలం అవుతున్నారన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యంతో ఉన్న లారీలు వేచిచూడాల్సి వస్తోందన్నారు. మిల్లుల యజమానులు మిల్లుకు వచ్చిన లారీలను వెంటనే ఖాళీ చేసి పంపితే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి రాదని గుత్తేదారు వివరణ ఇచ్చారు.

## మహిళా సంఘం సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

### జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీనివాస్

**మెదక్, నవంబర్ 10, ప్రభాతవార్త:** మహిళా సంఘం సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా గ్రామీణాభీవృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో జాతీయ గ్రామీణా జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం మహిళా సంఘాలకు 600 కోట్ల రుపాయల రుణాలను,మంజూరు చేయనున్నదని, సభ్యులు ప్రణాళికలు ఏర్పాటు చేసుకోని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చేతి వృత్తి పనులు కాకుండా, ఆధునిక యంత్రాలతో చేయగలిగే పనులను తెలుసుకోని వాటి ద్వారా జీవనోపాధి పోందాలని సూచించారు. గ్రామీణా ప్రాంతాలలో వివిధ రకాల వస్తువులను మార్కెట్‌లోకి తీసుకెళ్లడానికి మంజీరా ప్రోడక్ట్స్ వారు మహిళా సంఘాలకు చేయూతనందిస్తుందని, ముడి సరుకులను కూడ సరఫరా చేయడానికి తోడ్పాటు నందిస్తుందని అన్నారు. ఆర్థికంగా మహిళా సంఘాలు అభివృద్ధి చేందాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్ ఏ వస్తువు కోన్న అంతే త్వరగా వినియోగదారునికి వచ్చి చేరుతుందని, ఆ తరహాలోనే నూతన వ్యాపారాలు ప్రారంభించాలని అన్నారు.కార్యక్రమంలో డిపిఎంలు కెన్నడీ, ప్రకాష్, మోహన్, వెంకటేశం, మెర్సినా, సురెష్, డీఎంజీ నాగరాజు, సీసీ యశోద పాల్గోన్నారు.

## గంధపు మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన

**ములుగు, నవంబర్ 10 (ప్రభాతవార్త):** గంధపు మొక్కల పెంపకం, అమ్మకంపై ములుగు అటవీ కళాశాల విద్యార్థులు గురువారం మండలకేంద్రమైన ములుగుతో పాటు అచ్చాయిపల్లి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ కళాశాల పరిశోధన అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎన్ఎస్.శ్రీనిధి పర్యవేక్షణలో విద్యార్థులు తమ కళాశాలలో పెంచిన గంధపు మొక్కలను ప్రజలకు విక్రయించి వాటి ప్రాధాన్యత, పెంచే పద్దతులు, పెరిగిన వృక్షాలను ఎక్కడ విక్రయించాలో ఏజెన్సీ కేంద్రాల సమాచారాన్ని తెలిపారు. ఇందుకు సంబంధించి అందరికి అర్థమయ్యేవిధంగా గ్రామాల్లో వాల్‌పోస్టర్లు అతికించడంతో పాటు ఫ్లకార్డులతో గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనిధి మాట్లాడుతూ భారత ప్రభుత్వ సంస్థ మహాత్మగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ ప్రతిష్టాత్మకంగా ఈనెల 9వ తేదీన నిర్వహించిన నేషనల్ జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను అటవీ కళాశాల పరిశోధన సంస్థ (ఎఫ్‌సిఆర్ఐ) విద్యార్థులు ఘనంగా నిర్వహించారని తెలిపారు. విద్యార్థులు చేపట్టిన గంధపు మొక్కల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కళాశాల అభివృద్ధి కోసం వినియోగిస్తామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతతో ప్రజలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ భవిష్యత్తులో తమ కాళ్ళపై నిలబడి వ్యవస్థాపకులుగా ఎదగడానికి కళాశాల డీన్ సిఎం ఓఎస్‌డి ప్రియాంకవర్గీస్ కృషి చేస్తున్నారని తెలిపారు.



ములుగులో గంధపు మొక్కలను అందజేస్తున్న అటవీ కళాశాల విద్యార్థులు

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

### -అదనపు కలెక్టర్ రమేష్

**మెదక్, నవంబర్10 ప్రభాతవార్త:** రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించవలసిందిగా అదనపు కలెక్టర్ రమేష్ కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రైస్‌మిల్లులకు నిర్ధేశించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేసుకోవాలని, ఇందుకోసం కనీసం 50 మందికి తగ్గకుండా హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి మిల్లు కనీసం రోజు 40 ట్రాక్టర్లు, 10 లారీల నుండి ధాన్యం అన్‌లోడ్ చేసుకునేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో జిల్లాకు మంచి పేరుందని, ఈ సారి ధాన్యం చాలా బాగుంది కాబట్టి రైస్‌మిల్లర్లు అవసరమైన గోదాములు ఏర్పాటు చేసుకొని లారీలు మిల్లులకు వచ్చిన 24 గంటల్లోగా అన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. లోకల్, నాన్‌లోకల్ అని చూడకుండా మిల్లులకు వచ్చిన వరుస క్రమంలో లారీలు, ట్రాక్టర్‌ల నుండి ధాన్యం దించుకోవాలని మిల్లర్లకు సూచించారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 410 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు మద్దతు ధర అందేలా అధికారులు చూడాలన్నారు. ధాన్యం సేకరణ అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, మండల పరిషద్ అధికారులు, కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పని చేస్తూ వచ్చే 20 రోజుల్లోగా ధాన్యం సేకరణ ముగించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రానికి దాన్యం తీసుకొచ్చే రైతులకు కేంద్రం నిర్వాహకులు టోకెన్లు జారీ చేసి ఆ వరుస క్రమంలోనే ధాన్యం తూకం వేయాలన్నారు. గన్నీ సంచులు, లారీల ప్రగతిని రోజు వారి సమీక్షిస్తూ ఎక్కడ కొరత లేకుండా చూడాలని, ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. కేంద్రాలలో అవసరమైన ప్యాడీ క్లీనర్లు, తమను కొలిచే యంత్రాలు, తాడిపత్రిలు, డిజిటల్ తూకాలతో పాటు మంచినీరు, సుతిలి, అవసరమైన కేంద్రాలలో షామియానాల ఏర్పాటు చేయడంతో పాటు చిన్న చిన్న సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలని, రైతులు ధర్నాలు చేసే స్థాయికి రాకుండా ముదస్తు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో మాదిరే ఈ సారి కూడా ధాన్యాన్ని గద్వాల, వనపర్తి జిల్లాలకు తరలిస్తున్నామని అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, కాకపోతే రైతుల కాస్త ఓపిక పట్టాలని, సంయమనం పాటించాలని అదనపు కలెక్టర్ రమేష్ కోరారు. రైస్‌మిల్లుల సంఘం అధ్యక్షులు చంద్రపాల్ మాట్లాడుతూ ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని మిల్లులకు పంపాలని, రైస్‌మిల్లుల్లో స్థలాభావం వల్ల 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బయటి పంపాలని కోరారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో డీఎస్‌వో శ్రీనివాస్, జిల్లా మేనేజర్ గోపాల్, డీసీవో కరుణ, అడిషనల్ డీఆర్‌డీవో భీమయ్య, మండల ప్రత్యేకాధికారులు, కేంద్రం నిర్వాహకులు, వీఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

## రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు రాకుండా చూడాలి

### జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ అధికారులను అదేశించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం 2వ,3వ, 4వ స్థాయి సంఘం సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రైతులు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. చేప పిల్లల పంపిణీలో చనిపోయిన పిల్లలు వస్తున్నాయని అలా జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్య శాఖ అధికారికి సూచించారు. లబ్దిదారులకు ఏ మా త్రం నష్టం జరగకుండా చూడాలన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో దయాలసిస్ కేంద్రాలు ఉన్నాయని వాటిని సది ్వ నియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గ్రంధాల యంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జడ్పీ స్థాయి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రోజాశర్మ

అలాగే పశుసంవర్థక, పాడి పరిశ్రమ, చేనేత జౌళిశాఖ, విద్యాశాఖల ప్రగతిని అడిగి తెలుసుకొని అమె చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసిలు శ్యామల నాగరాజు, సుకూరి లక్ష్మీ, శెట్టి మల్లేశం, గిరికొండల్‌రెడ్డి, కో-అప్షన్ సభ్యులు సలీం, సీఈఓ రమేష్, డిప్యూటీ సీఈఓ సుమతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కెసిఆర్ కృషి

### గజ్వేల్ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**జగదేవ్‌పూర్, నవంబర్ 10 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామం అన్ని విధాలా అభివృద్ధి సాధించిందని, అది కేవలం ముఖ్యమంత్రి కెసిఆర్‌తోనే సాధ్యమైందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి బాలేషం గౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్ట ద్వారా సాగునీరు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌దే అని అన్నారు. అంతకు ముందు సర్వసభ్య సమావేశంలో మండల వ్యవసాయాధికారి వసంతరావు తమ నివేదికను చదివి వినిపించారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను తమ నివేదికల ద్వారా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని ముందంజలో ఉంచాలని అన్నారు. కొండాపూర్ సర్పంచ్ జహంగీర్ మాట్లాడుతూ తమ గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని తీర్చాలని, గ్రామంలోని అంగన్‌వాడీ పిల్లలు చదువుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపిపి బాలేషంగౌడ్ స్పందిస్తూ ఎక్కడైనా పిల్లలు తక్కువగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆ గ్రామానికి అనుసంధానం చేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌కు వివరించారు. అదేవిధంగా సమావేశంలో ప్రతి ఎంపిటిసికి రూ.15 లక్షల అభివృద్ధి పనులు ఇవ్వాలని, జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 24 గంటలు సేవలు అందించేందుకు తీర్మాణం చేసి నిర్ణయించడం జరిగిందని తెలిపారు. అనంతరం తీగుల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి నివేదితకు పిజిలో సీటు వచ్చినందుకు ఆమెను ఎంపిపి, జెడ్‌పిటిసి, ఏఎంసి చైర్మన్‌లు నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, గజ్వేల్ ఏఎంసి వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్‌వర్మ, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్, మండల ఫోరం అధ్యక్షుడు మాసూరి కావ్యదర్గయ్య, ఎంపిటిసిలు స్రవంతి, మహేందర్‌రెడ్డి, కవితశ్రీనివాస్‌రెడ్డి, రమ్య, సర్పంచ్‌లు భానుప్రకాశ్‌రావు, లింగాల బిక్షపతి, మిషన్ భగీరథ ఏఈ తిరుమల్‌రెడ్డి, పిఆర్ ఏఈ దేవయ్య, విద్యుత్ శాఖ ఏఈ రాజేంద్రప్రసాద్, వెటర్నరీ డాక్టర్ శ్వేత, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఓ సిబ్బంది ఆంజనేయులు, మదార్, అనిత, వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్

## బాల బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

### చైల్డ్ ఫండ్ ఇండియా (చందానగర్) కో-ఆర్డినేటర్ గ్రేస్

**సంగారెడ్డి, నవంబర్ 10, ప్రభాతవార్త:** బాల బాలికలు తమకున్న హక్కుల గురించి వాటిని సంరక్షించుకోవడానికి ఉన్న మార్గల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆ విధంగా ఉంటేను సమజంలో పూర్తి రక్షణ బాధ్యత ఉంటుందని ఎడ్యుకేషన్ అండ్ చైల్డ్ ఫండ్ ఇండియా (చందానగర్) కో-ఆర్డినేటర్ గ్రేస్ పేర్కొన్నారు. గురువారం నాడు సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం వెలిమెల గ్రామంలోని తెలంగాణ మోడల్‌స్కూల్, కళాశాలలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... బాలికలు అత్యవసర పరిస్థితుల్లో 1098 కు కాల్ చేయాలని ఆమె సూచించారు. వ్యవస్థలో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని, మంచి చెడులపై పూర్తి అవగాహన కలిగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని చైల్డ్ ఫండ్ ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ ఫెసిలిటేటర్ దీప సహయంతో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ తెలిపారు. నేటి సమజంలో తమ హక్కుల ఉల్లంఘన జరగకుండా సంబంధిత సంస్థల ద్వారా వాటిని సాధించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన చైల్డ్ ఫండ్ ఇండియా నిర్వాహకులు గ్రేస్, దీప లకు ప్రిన్సిపల్ రాంప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యులు మల్లికార్జున్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.




గ్రేస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపల్ రాంప్రసాద్



ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రమేశ్ తదితరులు

## రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం తూకం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్

**నర్సాపూర్, నవంబర్ 10, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ఇబ్బంది కలుగకుండా టోకెన్లు జారీ చేసి వరుస క్రమంలో ధాన్యం తూకం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేశ్ అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో పిఏసిఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరియు నర్సాపూర్ మార్కెట్ యార్డులో ఐకెపి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రమేశ్ అకస్మికంగా తనిఖీ చేశారు. అటు తర్వాత రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని వెంకటేశ్వర రైస్ మిల్‌ను ఆయన అకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు ధాన్యం తూకంలో ఎటువంటి వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 374 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 5055 మంది రైతుల నుండి సుమారు 53 కోట్ల విలువ గల 25 వేల 630 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేసి 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరిలించామని తెలిపారు.ఈ మేరకు ఏ గ్రేడు ధాన్యం కు 2060, సాధారణ రకం కు 2040 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందని, ఈ మేరకు రైతుల మధ్యదళారీలు ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని తెలిపారు. 17 శాతం తేమ మించకుండా తాలు లేకుండా ఎఫ్‌సిఐ ప్రమాణాలకనుగుణంగా నాణ్యమైన ధాన్యం ను కేంద్రాలకు తీసుకురావాలన్నారు.ధాన్యం తరలించే వాహానాల ను రోడ్ల పై వేచి ఉండకుండా కొనుగోలు కేంద్రాల్లో మిల్లులో అవస రం మేరకు కూలీలను ఏర్పాటు చేసుకొని లోకల్ నాన్‌లోకల్ అని చూడకుండా మిల్లుకు వచ్చిన ధాన్యం ను వరుస క్రమంలో లారీలు, ట్రాక్టర్ల నుండి ధాన్యంను దించుకోవాలని మిల్లర్లకు సూచించారు. మండల తహాశీల్దార్ ఆంజనేయులు, పిఏసిఎస్ చైర్మన్ రాజుయా దవ్, డిటి సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల అదుపులో పోలీసుల పాత్ర కీలకం

### -మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

**అల్లాదుర్గం, నవంబర్ 10, ప్రభాతవార్త:** జిల్లాలో నేరాల అదుపులో పోలీసుల పాత్ర కీలకమని, నేరాలు ఈ సంవత్సరం తగ్గుముఖం పట్టాయని మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శినిపేర్కొన్నారు. గురువారం నాడు సాయంత్రం అల్లాదుర్గం సిఐ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లను గత మూడు సంవత్సరాల నుండి నమోదైన కేసుల స్థితిగతులపై ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పరిశీలించగలడానికి నేడు అల్లాదుర్గం సీఐ కార్యాలయం సందర్శించినట్లు ఆమె తెలిపారు. పోలీసులు నిరంతర పర్యవేక్షణలో ఈ సంవత్సరం నేరాలు తగ్గినట్లు వివరించారు. అల్లాదుర్గం సర్కిల్ పరిధిలోని గతంలో గంజాయి కేసులు నమోదు కాగా ఈ సంవత్సరం పోలీసులు నిరంతరం నిఘాతో ఇప్పటివరకు ఎక్కడ కూడా గంజాయి సాగు చేస్తున్న దాఖలాలు లేవన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో కలసి గంజాయి సాగుపై ప్రత్యే దృష్టి సాధించడం జరిగిందన్నారు. హెల్మెట్ వాడకంపై ప్రత్యేక డ్రైవ్‌కు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందన్నారు. గత సంవత్సరం నుండి ఇప్పటి వరకు 39 తక్కువగా కేసులు నమోదయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ సైదులు, అల్లాదుర్గం ఎస్ఐ జార్జ్, అల్లాదుర్గం, టేక్మాల్, రేగోడ్, పెద్దశంకరంపేట్ ఎస్ఐలు ప్రవీణ్‌రెడ్డి, లింగం, సత్యనారాయణ, బాలరాజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




సీఐ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని


మాచాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాబు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ గాజుల బాబు

**చిన్నకోడూరు, నవంబర్ 10, ప్రభాతవార్త :** ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర అందించడానికి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గాజుల బాబు అన్నారు. మండల పరిధిలోని మాచాపూర్‌లో గురువారం గాజుల బాబు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే సమయంలో అరబెట్టి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి జమున ఎల్లయ్య, ఉపసర్పంచ్ పున్నం సురేష్, టిఆర్ఎస్ నాయకులు ఏలేటి రాజారెడ్డి, గుర్రాల రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎతుట జమీల్, వెలుగు సీసీలు, సీఎలు లింగవ్వ, జ్యోతి, పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ అశయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

**మర్కుక్, నవంబర్ 10(ప్రభాతవార్త):** ధాన్యానికి గిట్టుబాటుధర కల్పించి చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి రాంచంద్రం తెలిపారు. మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని గురువారం ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మిరాములుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న గిట్టుబాటుధరకే రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ఏ-గ్రేడ్‌కు రూ.2060, బి-గ్రేడ్ ధాన్యానికి రూ.2040 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి నరేందర్, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, వార్డుసభ్యులు గీత ఆంజనేయులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఐకెపి సిసి కవిత, టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, గ్రామస్తులు, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


నాచారంలో కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

**వర్గల్, నవంబర్ 10 (ప్రభాతవార్త):** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, ఎంపిపి లతారమేష్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండలంలోని నాచారంలో వడ్ల కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మద్దతుధర ఇచ్చి ఆదుకుంటున్నారని అన్నారు. రైతులు కొనుగోలుకేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని విక్రయించాలని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు జాలిగామ వెంకటేష్‌గౌడ్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, నాచారం ఆలయ కమిటీ డైరెక్టర్ పడిగె రాజు, నాగరాజు, నర్సింలు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
### -డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి


ములుగు చెరువులో చేప పిల్లలు వదులుతున్న డిసిసిబి డైరెక్టర్ అంజిరెడ్డి

**ములుగు, నవంబర్ 10 (ప్రభాతవార్త):** మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టిందని డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ములుగు మండల పరిధిలోని ములుగు చెరువులో 42వేలు, కొక్కొండ చెరువులో 80వేలు, సింగన్నగూడ, శ్రీరాంపూర్ చెరువులలో 90 వేలు, నర్సాపూర్ చెరువులో 54వేలు, తునికిబొల్లారం చెరువులో 1.53 లక్షల చేప పిల్లలు వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కులవృత్తుల వారిని పట్టించుకున్న పాపాన పోలేదని, కెసిఆర్ ప్రభుత్వం వచ్చాక బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదిగేలా ఎన్నో సంక్షేమ పతకాలు ప్రవేశపెట్టి బీద కుటుంబాలకు చేయూతనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి దేవేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బంగ్ల గణేష్, బాలకృష్ణ, బాలమల్లేష్, ములుగు ఎంపిటిసి హరిబాబు, సీనియర్ నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్, నగేష్, శ్రీనివాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాచగిరి క్షేత్రంలో సామూహిక వ్రతాలు

**వర్గల్, నవంబర్ 10 (ప్రభాతవార్త):** నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ వ్రతాలు భక్తులు పెద్దసంఖ్యలో జరుపుకున్నారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించుకొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ చైర్మన్ హరిపంతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కట్ట సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.


సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరుపుకుంటున్న భక్తులు


గవర్నర్ తమిళిసైకి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలుకుతున్న తహసీల్దార్


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ తమిళిసై

# గవర్నర్ తమిళిసైకి ఘనస్వాగతం

**ములుగు, నవంబర్ 10 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై గురువారం ములుగు అటవీ పరిశోధనా కేంద్రానికి రావడంతో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ తమిళిసై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో గవర్నర్ పర్యటన కొనసాగాల్సి ఉండగా అందుకు భిన్నంగా కేవలం మండల స్థాయి అధికారులు ఆమెకు స్వాగతం పలికి తూతూ మంత్రంగా పర్యటన ముగింపజేశారు. అరగంట పాటు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో ఆమె సేదతీరి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. గవర్నర్ పర్యటన సందర్భంగా గజ్వేల్ ఏసిపి రమేష్ పర్యవేక్షణలో ములుగు ఎస్ఐ రంగ కృష్ణ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. గవర్నర్ పర్యటన ఎలాంటి హడావుడి, ఆర్భాటం లేకుండా ప్రశాంతంగా ముగియడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# ఫీజ్ రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

**హుస్నాబాద్, నవంబరు 10,ప్రభాతవార్త** పెండంగ్‌లో ఉన్న ఫీజ్ రియంబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్స్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బిసి సంక్షేమ సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రాస్తారోఖో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ గియాస్ ఉన్నిసా బేగంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ధనికరాష్ట్రం అంటూ చెప్పుకుంటున్న టిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్స్, ఫీజ్ రియంబర్స్‌మెంట్ రెండేళ్లుగా విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. స్కాలర్‌షిప్స్ విడుదల చేయకపోవడంవల్ల పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రియంబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

## రాజనగరం జాతర వేలం..

**వనపర్తి టౌన్, నవంబర్ 10 ప్రభాతవార్త:** వనపర్తి పురపాలక సంఘం పరిధిలోని రాజనగరం రామలింగేశ్వర స్వామి దేవస్థానం జాతర 2022( రాజనగరం జాతర) కు సంబంధించి జాతరలో ఏర్పాటు చేసే దుకాణాలు, ఇతరముల నుండి ఫీజు వసూలు చేయుటకు గురువారం వనపర్తి పురపాలక సంఘం కార్యలయంలో చైర్మెన్, వైస్ చైర్మెన్, కమిషనర్ ల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ బహిరంవేలం పాటలో 8మంది పాల్గొనగా వారిలో డి.రాజు తండ్రి డి.మణ్యం లు రూ.1లక్ష41 వేలకు అత్యధిక వేలం పాట పాడి రాజనగరం జాతర ను దక్కించుకున్నారు. గత ఏడాది రూ.40వేల800 లకు వేలం జరగగా ఈ ఏడాది రూ.లక్ష అదనంగా మున్సి పాలిటీకీ ఆదాయం సమకూరిందని కమిషనర్ తెలిపారు. వేలం పాటలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల డిమాండ్స్‌ను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలి

**బొంరాస్‌పేట్, నవంబర్ 10,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్రస్థాయి సమావేశంలో ఆరు ప్రధాన అంశాలను చర్చించి తీర్మానించడం జరిగిందని తాలుక అధ్యక్షులు నర్సిములు,ఉపాధ్యాక్షులు బాబయ్య నాయుడు అన్నారు. తుంకిమెట్ల గ్రామంలో గురువారం మండల అధ్యక్షులు తిరుపతయ్య నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వా రు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ తీర్మానించిన ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటిని ప్రభుత్వం వెంటనే అమోదించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.ముదిరాజ్‌ల ప్రధాన ప్రధాన డిమాండ్స్ తెలంగాణ ఎ. షరీఫ్ కార్పోరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు ముదిరాజ్‌లను బిసి'డి' గ్రూప్ నుండి బిసి'ఏ' గ్రూపులోకి మార్చాలి.వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయడం, మత్స్య సంరక్షణ చట్టంను ప్రభుత్వం ఏర్పాటు చెయడం, మత్స్య శాఖకు 3వేల కోట్లు కేటాయించాలి.ప్రతి జిల్లాలో మత్స్యశాఖలు(సొసైటీ) ఫిషరీష్ సొసైటీలు ఏర్పాటు చేయాలి.ప్రభుత్వం ముదిరాజ్‌ల డిమాండ్లను అమోదించకుంటే ప్రభుత్వంకు వ్యతిరేకంగా పనిచేయాడానికి ముదిరాజ్‌లు సిద్దంగా ఉన్నారన్నారు.నవంబర్ 21వ తేదిన ప్రతి గ్రామంలో ముదిరాజ్ జెండా అవిష్కరణ కార్యక్రమం నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. వ్యతిరేకంగా ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు సిఎచ్ అనంతయ్య, ఉపాధ్యాక్షులు టీ కృష్ణ,కోశాధికారి అంజిలయ్య,సర్పంచ్ హన్మంతు,గ్రా అధ్యక్షులు అనంతయ్య, చందు,శివకుమార్,దస్తయ్య పాల్గొన్నారు.

## నేడు ఉచిత దంతవైద్య చికిత్స శిబిరం

**కొడంగల్, నవంబర్ 10 ప్రభాతవార్త :** శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి,కార్యదర్శి దాసప్పయాదవ్, కోశాధికారి వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్‌లు తెలిపారు. వికారాబాద్ శ్రీసాయి డెంటల్ కాలేజి వైద్య బృందం ఆధ్వర్యంలో కొడంగల్ ప్రభుత వ ఆసుపత్రిలో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకకు చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## దొంగల నుంచి గొర్రెల పెంపకందారులను రక్షించండి
### డీఎస్‌బీసీయు అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్

**శ్రీరంగాపూర్, నవంబర్ 10 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం రాత్రి 11:30గంటల సమయంలో కర్నూలు జిల్లాకు సంబందించిన దొంగలు కారు, బులెరో వాహనాల ద్వారా ఊరి దగ్గర ఉన్న గొల్ల చిన్నయ్య, అంజి, శేఖర్ గొర్రెల మందపై దాడిచేసి 12 గొర్రెలను దొంగలించగా గొర్రెల కాపరులు చూసి పోలీసులకు ఫోను చేసి సమాచారం చెప్పిన ఫలితం లేకపోవడం వల్ల గొర్రెల యజమాపులు కలిసికట్టుగా రహదారులకు కావలి కాశీ వెంటపడి సుధాకర్ అనే దొంగను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగింది. మిగతా దొంగలు తెచ్చుకున్న వాహనాల ద్వారా గొర్రెలను తీసుకువెళ్లారు. ఈవిధంగా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుండి కర్నూలు జిల్లా ప్రాంతం కేంద్రంగా పెద్దఎత్తుగా గొర్రెల దొంగతనాలు జరుగుతున్నాయని దీనిని నివారించడంలో అధికార యంత్రాంగం విఫలం అవుతున్నారని గొర్రెల పెంపకం దార్ల సహకార జిల్లా యూనియన్ అధ్యక్షుడు పి.కురుమూర్తి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు తెలంగాణ ప్రభుత్వం గొర్రెలను అభివృద్ధి చేయాలని పెద్ద ఎత్తున ఎస్ఆర్‌డీపీ ద్వారా గొర్రెల పంపిణీ చేపడుతుంటే మరోవైపు గొర్రెల పెంపకం దారులపై దాడులు, దౌర్జన్యాలు, దొంగతనాలకు గురవుతూ దినదిన గండం నూరేళ్ల ఆయుష్ గా ఈ వృత్తి కొనసాగుతుందని ఇక ముందు ఈ ఆటలు సాగన్వీమని ఆయన గొర్రెల కాపరులకు హామీ ఇచ్చారు. శ్రీరంగాపూర్ పోలీసు అధికారులు వెంటనే స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకొచ్చి మొత్తం దొంగల కూబీ లాగి చట్టరిత్యా తగు చర్యలు తీసుకొని రాబోయే కాలంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అధికారులను ఆదేశించినట్లు ఆయన చెప్పారు. తెలంగాణ లో ఏ ఒక్క గొల్ల కురువలకు అన్యాయం జరిగిన సహించబోమని ఆయన హెచ్చరించారు. గతంలో గొర్రెల యజమానులను అనేక చిత్రహింసలకు గురిచేసి పెంపకంవారులతోనే గొర్రెలను డీసీఎం లకు ఎక్కించిన సంఘటనలు కూడా ఉన్నాయని వారు గుర్తు చేశారు. కావున గొర్రెల యజమానులకు గొర్రెల భద్రత కల్పించాలని వారు కోరారు. శ్రీరంగాపూర్ గొర్రెల బాదితుల దగ్గరికి పోయి వారిని పరామర్శించి వారికి న్యాయం చేసిన దోశులను శిక్షించేందుకు ప్రయత్నం చేసాకతమని వారు హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా డీఎస్‌బీసీయు డైరెక్టర్ రాజశేఖర్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## 2కె రన్‌ను విజయవంతం చేద్దాం

**షాద్‌నగర్, నవంబర్ 10 ప్రభాతవార్త :** పట్టణ పరిధిలోని ఏబీవీ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 13న 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 8 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి పరిగి రోడ్డులోని ఏబీవీ ఆసుపత్రి వరకు 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు.

# అక్రమంగా గుట్కా, గంజాయి రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా

## జిల్లా ఎస్పీ అపూర్వరావు

**వనపర్తి క్రైం,నవంబర్ 10 ప్రభాతవార్త:** నేరాలను నియంత్రించేందుకు పరిశోధన లోనూ సాంకేతిక పరిజ్ఞానం ఆయుధంగా పోలీసులు ఉపయోగించుకోవాలని వనపర్తి ఎస్పీ కె.అపూర్వరావు అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు అన్ని పోలీస్ స్టేషన్ ఎస్సైలతో ఎస్పీ నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లోఉన్న కేసులను సత్వరమే పరిష్కారానికి కృషిచేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ప్రతి కేసులో సమగ్ర విచారణ చేపట్టి బాదితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా కొత్త కొత్త మోసాలకు పాల్పడుతూ అమాయక ప్రజల నగదును సునాయాసంగా దోచుకుంటున్నారని అన్నారు. జిల్లా ప్రజలందరికి సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఎవరైనా సైబర్ నేరం బారిన పడి నగదును కోల్పోయిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 నెంబర్ కు వెంటనే సమాచారం అందించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు శిక్షలు పడేలా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అక్రమంగా గుట్కా, గంజాయి రవాణ చేసేవారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిపై కేసు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లూ కోర్ట్స్,పెట్రోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను ఖచ్చితంగా పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు వారికి తగు సూచనలు చేయాలని కోరారు. నేరాల నియంత్రణలో చేదనలో సీసీ కెమరాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి నేను సైతం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి ప్రదేశంలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. 5-ఎస్ విధానంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని ఫైల్‌లను క్రమపద్దతిలో అమర్చుకోవాలని సూచించారు. ఈ నెల సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ షాకీర్ హుస్సేన్, వనపర్తి డీఎస్పీ ఆనంద్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస చారి, వనపర్తి సీఐ ప్రవీణ్ కుమార్, ఆత్మకూర్ సీఐ రత్నం, వనపర్తి జిల్లాలోని ఎస్సైలు, డీసీఆర్బీ సిబ్బంది, ఐటీ సెల్ సిబ్బంది ఉన్నారు.


సమీక్ష సమావేశంలో ఎస్పీ అపూర్వరావు, ఏఎస్పీ, డీఎస్పీ, ఎస్ఐలు


సిద్దిపేటలో ఈడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

### మంత్రి గంగుల కమలాకర్‌పై
## ఈడీ దాడులను వెంటనే ఆపాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర పౌరసరఫరాల, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలపై కక్షపూరితంగా చేస్తున్న ఈడీ దాడులను వెంటనే అపాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట మున్నూరు కాపు సంఘం నాయకులు పాల సాయిరాం, అల్లం ఎల్లం, బుస్సా శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. గురువారం కమలాకర్ నివాసంపై ఈడీ దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో ఈడీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి ఎదిగి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న గంగుల కమలాకర్ ఉన్నతిని చూసి ఓర్వలేక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈడీ దాడులకు పాల్పడుతుందన్నారు. ఈడీ దాడులకు భయపడే ప్రసక్తిలేదన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు కూర బాల్‌రెడ్డి, పాల శేఖర్, మన్మోహన్, పోతుల రమేష్, అంజనేయులు, ఎనుగుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలుచేయాలి


అర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, నవంబర్ 10, ప్రభాతవార్త :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అర్డీఓ కార్యాలయంలో అర్డీఓ అనంతరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్దన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంగెం మధు, కమిటీ నాయకులు ఎండి. ఇస్మాయిల్, అదిత్య, ఎండి షఫీ, ప్రవీణ్, ఎం.డి. అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎఫ్‌టీ లైసెన్సులు ఇతర కులాల వారికి ఇవ్వొద్దు..


ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10 ప్రభాతవార్త:** గీతకార్మిక వృత్తి గౌడ కులస్థుల హక్కు అని ఇతర కులస్థులకు టీఎఫ్‌టీ లైసెన్సులు ఇచ్చి గౌడ కులస్థులకు అన్యాయం చేయవద్దని జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్ సీఐ సుభాష్ కు వినతిపత్రం అందజేశారు. చిక్కేపల్లి గ్రామంలో ఇతర కులస్థులకు టీఎఫ్‌టీ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నారని వారు పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా గీత కార్మిక వృత్తిని నమ్ముకొని బతుకుదెరువు సాగిస్తున్న గౌడ కులస్థుల పొట్ట కొట్టవద్దని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇతర కులస్థులకు లైసెన్సులు ఇవ్వడానికి ఎక్సైజ్‌శాక సిద్దమైతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అక్కల నరేందర్ గౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, రామన్ గౌడ్, గౌడ సంఘం నాయకులు రాజేష్ గౌడ్, వినోద్ కుమార్ గౌడ్, శివగౌడ్, శ్రీధర్ గౌడ్, సురేందర్ గౌడ్, రాజు గౌడ్, ఎల్లగౌడ్, రాజశేఖర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**వనపర్తి టౌన్, నవంబర్ 10 ప్రభాతవార్త:** రాష్ట్ర వాల్మీకి బోయ ఐక్యకార్యచరణ స్టీరింగ్ కిటీ పిలుపు కమిటీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రంలో గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వాల్మీకి లు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు దానిలో భాగంగా ఐక్యబోయ కార్యచరణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చెల్లప్ప కమిషన్ వేసి ఎస్టీలో చేరుస్తానని ఇప్పటికి ఎనిమిదేళ్లు గడుస్తుంది అసెంబ్లీ సాక్షిగా చేస్తానని జీఓ నెంబర్ 6బిల్లు ఆఫైల్ ఎక్కడుందో ఇంతవరకు కేంద్రానికి పంపలేదు. వాల్మీకులను మబ్బ పెట్టి వాల్మీకి ఓట్ల కొరకు ఇప్పుడు చేస్తా, అప్పుడు చేస్తా అని చెప్పడం జరుగుతుందని గిరిజన10% రిజర్వేషన్ అసెంబ్లీ ముట్టగానే హైవే రోడ్డు దిగ్బంధం కార్యక్రమాలు చేస్తాం అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ రామ్మూర్తి నాయుడు, వేణుగోపాల్, డి.విష్ణు, వెంకటయ్య, కుమారస్వామి నాయుడు, ఎంకు మూర్తి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ముందు రిలే దీక్ష చేపడుతున్న వాల్మీకి బోయలు

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**ములుగు, నవంబర్ 10 (ప్రభాతవార్త):** మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ములుగు ఎస్ఐ రంగా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన నూనె మహేష్‌యాదవ్(32) మద్యానికి బానిసై అవారాగా తీరుగుతూ పొలం వద్ద కూడా పని చేయకపోయేవాడని, ఇలాగైతే కుటుంబ పోషణ ఎలా అని భార్య కళ్యాణి ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఎల్బీనగర్‌లో ఆరు నెలలు కౌన్సిలింగ్‌కు పంపించగా నెల రోజుల క్రితమే గ్రామానికి చేరుకున్నాడని, కొద్ది రోజులుగా మళ్ళీ మద్యం తాగడం మొదలుపెట్టగా బుధవారం మద్యం తాగి ఇంటికి రాగా భార్య మందలించడంతో పొలం వద్దకు వెళ్ళి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి నురగలు కక్కుతుండడంతో కుటుంబసభ్యులు వెంటనే సమీపంలోని ఆర్‌విఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతునికి భార్య కళ్యాణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేష్ మరణంపై ఎవరికి ఎలాంటి అనుమానాలు లేవని తాగుడుకు బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగాకృష్ణ పేర్కొన్నారు.


సిసి రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న జడ్పీటిసి స్వప్న

## రూ.3 లక్షల ఎంపిటిసి నిధులతో సిసి రోడ్డు
### -పనులను ప్రారంభించిన జడ్పీటిసి

**న్యాల్‌కల్, నవంబరు 10, ప్రభాతవార్త:** మండలంలోని మల్గి గ్రామ శివారులోని శ్రీ నవనాథ సిద్దేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో 3లక్షల రూపాయల ఎంపిటిసి నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి గురువారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్న భాస్కర్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జడ్పీటిసి సభ్యులు స్వప్న భాస్కర్ మాట్లాడుతూ మండలాభివృద్దే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. సిద్దేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుంటున్నందున ఆలయ పరిసరాల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు గౌసోద్దిన్, మల్గి ఎంపిటిసి సభ్యులు శివనందశ్రీపతి, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మున్నూర్ రవీందర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, మారుతియాదవ్, అత్నూర్ మాజీ సర్పంచ్ రాజుపాటిల్, మల్గి టిఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షులు సిద్దారెడ్డి, సంగమేశ్, మల్గి పంచాయితీ వార్డు సభ్యులు విఠల్, ఆలయ కమిటి బాధునఉయలు ఎన్కతల నర్సింహారెడ్డి, భద్రయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జీపిఎఫ్ మొత్తాలపై వడ్డీనష్టం నివారించాలి


డిప్యూటీ సీఈఓ స్వప్నకు వినతిపత్రం అందజేస్తున్న టిపిటిఎఫ్ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 10, ప్రభాతవార్త:** ఉద్యోగ ఉపాధ్యాయులు జీపిఎఫ్ నుండి తీసుకుంటున్న రుణాలను మంజూరుచేసి వెంటనే ఖాతాలకు జమచేయాలని టిపిటిఎఫ్ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం డిప్యూటీ సీఈఓ స్వప్నకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి అనుములు రాంచందర్ మాట్లాడుతూ జీపిఎఫ్ ఖాతాల నుండి తాము తీసుకుంటున్న రుణాలను తమఖాతనుంచి మినహానుంచి వెంటనే ఖాతాలో జమచేయకుండా నెలలతరబడి జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మార్చినెలనుంచి కొందరు ఉద్యోగ ఉపాధ్యాయులకు గత మార్చ్‌నెలలో జీపిఎఫ్ ఖాతాలనుంచి మినహాయించారని కానీ నేటివరకు వ్యక్తిగత ఖాతాలకు ప్రభుత్వం జమచేయలేదని అన్నారు. దినివల్ల ఒక్కొక్కరు 6 నెలల వడ్డీని నష్టపోతున్నారని అన్నారు. వడ్డీనష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిపిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్, హత్నూర శాఖ అధ్యక్షులు రవీందర్ లు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**గుమ్మడిదల, నవంబర్ 10, ప్రభాతవార్త:** గుమ్మడిదల గ్రామంలోని మశీరెడ్డిగారి లక్ష్మివెంకటేష్ కుమారుడైన నవీన్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నా విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించి ఈ సందర్భంగా టిఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ ఉపసర్పంచ్ ఎం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుని ప్రార్థించి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆకుల ఆంజనేయులు, ఆతినారం రాము, టిఆర్ఎస్ నాయకురాలు నాగమణి, దత్తాత్రేయ, చంద్రారెడ్డి, సంగం మల్లేషా, ఇమ్రాన్, కూరగాయల నర్సింలు, నవీన్, దామోదర్ చారి, ఆంజనేయులు చారి, మల్లేష్ చారి, సత్యనారాయణ, రవికుమార్, బండాల రాజు, కోటేశ్వర్ చారి, రామ్ చందర్, కొత్త కృష్ణ, మేకల యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, చందు చారి, మల్లేష్, శ్రీకాంత్ గౌడ్, లక్ష్మణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో బిజెపి రైతు ర్యాలీ


రైతు ర్యాలీలో పాల్గొన్న బిజెపి నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 10, ప్రభాతవార్త:** ఈ నెల 12న రామగుండంలో ఎరువుల కర్మాగారం ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని మోడీ కి స్వాగతం పలికుతూ గురువారం సంగారెడ్డిలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ నర్సారెడ్డి ఆధ్వర్యంలో రైతుర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్‌రెడ్డి, బిజెపి నాయకులు కొండాపురం జగన్, విష్ణువర్దన్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, అరుణ, జిల్లా నాయకులు, రవీందర్‌రెడ్డి, పోచారం రాములు, కె వాసు, మందుల నాగరాజు, మురళిధర్‌రెడ్డి, పవన్ ముదిరాజ్, ఆశ్వంత్, మాణిక్ రావు, మండల అధ్యక్షులు ప్రసాది రవిశంకర్, నల్లనర్సింహారెడ్డి, పాపయ్య, శ్రీనివాస్, అంబదాస్ పాల్గొన్నారు.

## తెల్లాపూర్, ఉస్మాన్ నగర్ మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే

**సంగారెడ్డి, నవంబర్ 10, ప్రభాతవార్త:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ వార్డుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 60 లక్షల లీటర్ల సామర్థ్యంతో నూతన రిజర్వాయర్ నిర్మిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం నాడు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ రిజర్వాయర్ ద్వారా తెల్లాపూర్ తోపాటు ఉస్మానర్ పరిధిలోని అన్ని కాలనీలకు ప్రతిరోజు మంచినీటిని అందించడం జరుగుతుందన్నారు. శరవేగంగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోని వస్తామని ఎమ్మెల్యే తెలిపారు. 40 లక్షల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుమారు 22 కిలోమీటర్ల మేర పైపులైను ఏర్పాటు చేసిన్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్ ఆధ్వర్యంలో రిజర్వాయర్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ లలితసోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ చిట్టి, ఉమేశ్వర్, హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం నారాయణ, డీజీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## ఆత్మగౌరవ భవనాలు అభివృద్ధికి వేదికలు
### పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**సంగారెడ్డి, నవంబర్ 10, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కుల సంఘాల ఆత్మగౌరవాన్ని పెంచేలా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాళ్లు అభివృద్ధికి వేదికలుగా నిలుస్తాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ముదిరాజ్, కురుమ, కుమ్మరి, వెలిమెలలో 50 లక్షల రూపాయలతో బుడగ జంగాల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక అభ్యున్నతికి ధ్యేయంగా ముఖ్యమంత్రి కెసిఆర్ పనిచేస్తున్నారని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న కుల సంఘాల భవనాలు ఆత్మ గౌరవానికి వేదికలుగా నిలవాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లలితసోమిరెడ్డి, వైస్‌చైర్మన్ రాములు గౌడ్, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు సుచరితకొమురయ్య, రవీందర్‌రెడ్డి, శంషబాద్ రాజు, టిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, స్థానిక కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సికిల్లాపూర్‌లో అగ్నిప్రమాదం-పూరిల్లు దగ్ధం


ప్రమాద స్థలంలో విచారణ చేస్తున్న ఆర్ఐ గంగాధర్

**హత్నూర, నవంబర్ 10, ప్రభాతవార్త:** హత్నూర మండలం సికిల్లాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి రెండు లక్షల ఆస్తినష్టం జరిగిందని స్థానిక ఎంపీటీసీ కౌడిపల్లి వెంకటయ్య తెలిపారు. సికిల్లాపూర్ గ్రామానికి చెందిన మంగలి మల్లేశం ఇంట్లో ఉన్న వంటగ్యాస్ పేలి అగ్నిప్రమాదం జరిగిందని, ఈ అగ్నిప్రమాదం వల్ల ఇళ్లు పూర్తిగా కాలిపోయి ఇంట్లో ఉన్న వంట సామాగ్రి, బట్టలు, బియ్యం, టివి, ఇతర వస్తువులు కాలిపోయాయని అన్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అన్నారు. బాధితునికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న హత్నూర ఆర్ఐ గురువారం ఘటన స్థలానికి చేరుకొని ఆస్తినష్టాన్ని అంచన వేశారు. ఆర్ఐ గంగాధర్ తోపాటు సర్పంచ్ మాణిక్‌రెడ్డి, ఉపసర్పంచ్ కౌడిపల్లి యాదగిరి, గ్రామస్తులు ఉన్నారు.

## దివ్యాంగుల రవాణాకు బస్సుసౌకర్యం ఏర్పాటు

**హత్నూర, నవంబర్ 10, ప్రభాతవార్త:** సంగారెడ్డిలో గురువారం నిర్వహించిన సదరం క్యాంపుకు హత్నూర మండలం నుంచి హాజరయ్యే దివ్యాంగుల కొరకు సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రవాణా కొరకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి దౌల్తాబాద్ నుంచి వెళ్లే బస్సును దౌల్తాబాద్‌లో ఎంపీపీ నర్సింలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు శివశంకర్ రావు మాట్లాడుతూ బస్సులో 18 మంది దివ్యాంగులతో పాటు వారి తల్లిదండ్రులు, సహాయకులు మొత్తం 40 మంది సంగారెడ్డి వెళ్లారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, రాంచంద్రారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య గ్రామీణ జీవనోపాధుల మిషన్ సమావేశం

**గుమ్మడిదల, నవంబర్ 10, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల మహిళా సమాఖ్య గ్రామీణా జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా అమలు చేస్తున్న మోడల్ మండల సమాఖ్యలో భాగంగా రెండోవ ఫేస్ సమావేశము నిర్వహించి మండలంలోని అన్ని గ్రామ సంఘాలలో, స్వయంసహాయక సంఘాలలో భాగంగా రెండోవ ఫేస్ సమావేశం నిర్వహించి మండలంలోని అన్ని గ్రామ సంఘాలలో, స్వయంసహాయక సంఘాలలో రాబోవు 5 సంవత్సరాలలో సంఘాల సభ్యులు, గ్రామ సంఘాలలో చేపట్టబోయే అభివృద్ధి విషయాలు అయినా (6) కీలక అంశాలపైన గ్రామా సంఘాల వారీగా ప్రాధాన్యనాతలను చర్చించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సూర్యరావు హాజరయ్యి మాట్లాడుతూ చేసుకున్న ప్రణాళికలను పరిశీలించి ప్రతి గ్రామా సంఘము సామాజిక, ఆరోగ్య, ఆదాయాల పెంపుదల విషయాలను ప్రాధాన్యత క్రమములో పరిగణలోకి తీసుకోని 5 సంవత్సరాలలో ప్రగతి దిశగా చర్యలు చేపట్టాలని సూచించడం జరిగింది. డీపీఎంలు వివో వారీగా తయారు చేసిన ప్రఖాళికలను అంశాల వారీగా క్రోడీకరించాలని తెలియజేయడం జరిగింది. అనంతరం అదనపు డిఆర్డిఓ కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యము కొనుగోలు చేయాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమలో డీపీఎంఎస్ జయశ్రీ రాజ్, రవీందర్, కొమురయ్య, సత్యనారాయణ, సిబిఓ ఆడిటర్ బాలరాజు, దాసుబాబు, శివకుమార్, ఏపీఎం, సీసీలు, గ్రామ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని ఉపాధ్యాయుడు మృతి

**సంగారెడ్డి, నవంబరు 10, ప్రభాతవార్త:** రైలు పట్టాలు దాటుతున్న తరుణంలో రైలు ఢీకొన్న సంఘటనలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం జహీరాబాద్ పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం... జహీరాబాద్ పట్టణంలోని గడి ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయులు రవీందర్ అల్లీపూర్ గ్రామ శివారులో రైలు పట్టాలు దాటుదుండగా అకస్మాత్తుగా రైలు రావడంతో రైలు ఢీకొని రవీందర్ అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడన్నారు. మృతి చెందిన ఉపాధ్యాయులు రవీందర్ న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు. రెండేళ్ల క్రితం రవీందర్ తండ్రి మృతి చెందడంతో అప్పటి నుంచి రవీందర్ తీవ్రంగా మానిసక క్షభను అనుభవిస్తున్నట్లు తెలుస్తోంది. జహీరాబాద్‌లో గురువారం రవీందర్‌కు ఉపాధ్యాయులు కన్నీటి వీడ్కోలు పలికారు.

## మహిళల సాధికారతపై అవగాహన కల్పించాలి
### -న్యాయమూర్తి హనుమంతరావు

**సంగారెడ్డి టౌన్, నవంబరు 10, ప్రభాతవార్త:** గ్రామాల్లోని మహిళలకు, బాలికలకు చట్టాలపై అంగన్‌వాడి టీచర్లు అవగాహన కల్పించాలని న్యాయమూర్తి జె హనుమంతరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని దుర్గాబాయి మహిళ వికాస కేంద్రంలో అంగన్‌వాడి టీచర్లతో న్యాయ సేవాధికారసంస్థ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామాల్లో అంగన్‌వాడి టీచర్లు ప్రజలకు దగ్గరగా ఉంటారని, అందుకు బాల్య వివాహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడిల్లో చిన్నారులకు పోషక ఆహారం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి శ్రీమతి పద్మావతి, మహిళవికాస కేంద్రం మేనేజర్ శ్రీమతి సుగుణ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

## వసతి గృహంలో విద్యార్థినులకు అవగాహన

**సంగారెడ్డి టౌన్, నవంబరు 10, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపులే బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో గురువారం విద్యార్థినులకు షీ-టీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ-టీం ఇంచార్జి, సంగారెడ్డి టౌన్ ఎస్ఐ కోటేశ్వర్‌రావు విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విద్యార్థినులు తమ ఫోన్‌లలో అనవసరమైన లింక్‌లపై క్లిక్ చేయరాదని సూచించారు. అత్యవసర సమయాల్లో 100కు దయల్ చేయాలని, సైబర్ క్రైమ్ సహాయం కోసం 1930ను దయల్ చేయాలన్నారు. వాట్సప్, ట్విట్టర్, ఫేస్ బుక్, హ్యాకింగ్‌ల గురించి గుర్తు తెలియని వారితో చర్చించకూ డదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రమేష్, సంతోషి, విద్యార్థినులు పాల్గొన్నారు.


ప్రభుకుమార్‌కు సన్మానిస్తున్న దృశ్యం

## క్రీడాకారులకు సంపూర్ణ సహకారం
### -మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

**సంగారెడ్డి, నవంబర్ 10, ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని యువ క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. వాకో ఇండియా రెండవ జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి స్పాన్సర్‌షిప్ అందించిన ప్రభుకుమార్ ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ప్రభుకుమార్‌కు శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులోను స్పాన్సర్‌షిప్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజలు

**సంగారెడ్డి, నవంబర్ 10, ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధిలోని వాణినగర్‌లో గురువారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కల్పన ఉపేందర్‌రెడ్డి, నవనీత జగదీష్, భక్తులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారణకు తరలివచ్చిన భక్తులు


అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వాములు

**సదాశివపేట, నవంబర్ 10, ప్రభాతవార్త:** కార్తీక మాసం ప్రారంభమైనప్పటి నుండి పట్టణంలోని అయ్యప్ప మందిరానికి సంగారెడ్డి జిల్లాతో పాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుండి అయ్యప్ప మాలదారణకు అయ్యప్ప భక్తులు సదాశివపేట పట్టణంలోని అయ్యప్ప మందిరానికి తరలివస్తున్నారు. గురువారం రోజు దాదాపు 100మంది వరకు అయ్యప్ప మాల వేసుకున్నారు. అయ్యప్ప మాలదారణకు వచ్చిన హక్తులతో అయ్యప్ప మందిరం కిటకిటలాడుతూ కనిపించింది. తెల్లవారుఝామున 5గంటల నుండి 5.30గంటల వరకు మందిరంలో భక్తిశ్రద్ధలతో గణపతి హోమం నిర్వహించిన తరువాత ఉదయం 5.30 తరువాత ఆలయంలో గుకుస్వాములు సుధాకర్‌గౌడ్, గోనే శంకర్, కృష్ణమనాయుడు, చింత గోపాల్, గురుస్వాముల అధ్వర్యంలో భక్తులకు అయ్యప్ప శరణుగోషల మద్య అయ్య ప్ప మాలలు ధరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు సోమశేఖర్, నరేష్, వెంకటేశంగౌడ్, శ్రీకాంత్, ప్రేమ్, రాజేష్, శంకర్, సుదర్శన్‌రెడ్డి, రాము, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన రైతు కోఆర్డినేటర్‌ని సన్మానించిన నాగేష్


కోఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**సదాశివపేట, నవంబర్ 10, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నూతన రైతు బంధు కో ఆర్డినేటర్ పట్లోళ్ళ అమరేందర్‌రెడ్డిని సంగారెడ్డి నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆత్మకూర్ నాగేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా స్వగ్రామం ఆత్మకూర్‌కు చెందిన సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ అమరేందర్‌రెడ్డికి ఈ పదవి దక్కడం ఎంతో అభినందనీయమన్నారు. తమ గ్రామంలో పెద్ద రైతు కూడా అవడం వల్ల మండలంలో రైతులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కొరమని కృష్ణ ముదిరాజ్, పిఎసిఎస్ డైరెక్టర్ మోతిసింగ్, జిల్లా బిసి సంఘం నాయకులు శ్రీశైలంయాదవ్, మండల ఎస్టీ సెల్ నాయకులు దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీకి మద్దతుగా బిజెపి ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న బిజెపి నాయకుల దృశ్యం

**సంగారెడ్డి, నవంబరు 10, ప్రభాతవార్త:** రామగుండంలో ఈ నెల 12న తారీఖున ప్రధాన మంత్రి నరేంద్ర మోది మూతపడిని ఎరువుల కర్మాగారాన్ని పున:ప్రారంబిస్తున్న సందర్భాన్ని పురష్కరించుకుని గురువారం నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ నాయకులు రైతులతో ర్యాలీ నిర్వహించారు. జహీరాబాద్ అసెంబ్లి ఆధ్వర్యంలో అసెంబ్లి కన్వీనర్ జనార్ధన్‌రెడ్డ నేతృత్వంలో రైతులతో కూడి పార్టీ నాయకులు కేంద్రానికి అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ బండారి, పట్టణ అధ్యక్షులు ప్రొద్దుటూరి శ్రీనివాస్ గుప్త, రాఘవేందర్‌నాయక్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల అధ్యక్షులు వీరారెడ్డి, ఎక్‌నాథ్‌రావు పాటిల్, బోగాడివన్న, దళిత నాయకులు అశోక్, బసవరాజ్ స్వామి, బండి వెంకట్, వేణు కడిగే, సోమ అనీల్, సురేష్ పూరి, దినేష్ యాదవ్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఉప్పల శ్రీకాంత్, మాణిక్, పూల సంతోష్, రేజింతల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులంలో వైద్య శిబిరం



మైనార్టీ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి, నవంబరు 10, ప్రభాతవార్త:** మండలంలోని అల్గోల్ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ గురుకులంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురుకులంలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు టీడీ టీకాలు వేశారు. ఆరోగ్యం కోసం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ సీతారామరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెవెస్ జమీల్, మొగుడంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సీతారామరాజు, సిహెచ్ఓ సత్యవతి, స్టాఫ్ నర్స్ సోలోమన్ రాజు, వార్డెన్ సమ్యుద్దీన్, స్కూల్ కో-ఆర్డినేటర్ రహీం పాషు, ధర్మేందర్, హెల్త్ సూపర్‌వైజరన బెండి నాగరాజు, హెల్త్ అసిస్టెంట్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉపాధి హామి పనులను గుర్తిస్తున్న ఉపాధి అధికారుల దృశ్యం

## దామర్‌గిద్దలో ఉపాధి పనుల గుర్తింపు

**నాగల్‌గిద్ద, నవంబరు 10, ప్రభాతవార్త:** మండలంలోని దామర్‌గిద్ద గ్రామంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామి పథకంలో చేపట్టే పనులను అధికారులు గురువారం గుర్తించారు. గ్రామానికి ఉపాధి హామి ఏపిఓ మురళిక్రిష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్‌లు చేరుకుని గ్రామస్థులతో గ్రామంలో చేపట్టే పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపిఓ మురళి క్రిష్ణ మాట్లాడుతూ గ్రామంలో చేపట్టే పనులను గుర్తించడం జరిగిందన్నారు. త్వరలోనే గ్రామంలో ఉపాధి హామిలో పనులవు ప్రారంభిస్తామన్నారు. ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని మురళిక్రిష్ణ సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పండరినాథ్‌రావు పాటిల్ తదితరులు ఉన్నారు.

## బసవేశ్వరుడిని అడుగుజాడల్లో పయనించాలి
### -భాల్కి పీఠాధిపతి శ్రీ బసవలింగ పట్టదేవం

**నాగల్‌గిద్ద, నవంబరు 10, ప్రభాతవార్త:** విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడు చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని భాల్కి పీఠాధిపతి శ్రీ బసవలింగ పట్టదేవరు సూచించారు. గురువారం మండల పరిధిలోని గుడూర్ గ్రామంలో విశ్వగురువు బసవేశ్వర విగ్రహా ప్రతిష్టాపన వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భాల్కి పీఠాధిపతి శ్రీ బసవలింగ పట్టదేవం భక్తులకు ప్రవచనాలు అందచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునిత ప్రభాకర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌సాగర్, మల్‌శెట్టి పాటిల్, శరణప్ప, బిరేదార్ సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


ఖలీల్‌పూర్ విద్యార్థులకు టీడీ టీకాలు వేస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, నవంబరు 10, ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రతతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మండలంలోని మిర్జాపూర్ (బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ శామల పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రి పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామంలోని పాఠశాలలో టీడీ టీకాలు, విలేజ్ హెల్త్, శానిటేసన్ కార్యక్రమాలను మిర్జాపూర్(బి) పిహెచ్‌సి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పిహెచ్ఎన్ శామల మాట్లాడుతూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు టీడీ కాలు వేశారు. 10 సంవత్సరాలు నిండి 16 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి విద్యార్థి విధిగా టీకాలు వేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బి దీపిక, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అభాగ్యునికి వైస్ చైర్మన్ ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అనీల్‌కుమార్‌రెడ్డి

**సంగారెడ్డి, నవంబరు 10, ప్రభాతవార్త:** కట్టుకున్న భార్య మృతి చెందడంతో అనారోగ్యానికి గురై అవస్థలు పడుతున్న అభాగ్యునికి మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో నివసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీతారామయ్య ధర్మపత్ని సావిత్రి ఇటీవల గుండెపోటుతో తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. భార్య మృతితో సీతారామయ్య అనారోగ్యానికి గురై అవస్థలు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న అనిల్‌కుమార్ రెడ్డి గురువారం సీతారామయ్య ఇంటికి చేరుకుని ధైర్యం చెబుతూ తన వంతుగా 5వేల రూపాయలను అందించారు. కార్యక్రమంలో బొల్లారం కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షులు కాటారం శ్రీనివాస్, పార్టీ నాయకులు ఉన్నారు.

## మునిపల్లి ఇంఛార్జ్ ఎంపిడివోగా వెంకటేశం బాధ్యతలు

**సంగారెడ్డి, నవంబర్ 10, ప్రభాతవార్త:** గురువారం నాడు మునిపల్లి మండల ఇంఛార్జ్ ఎంపిడివోగా జి వెంకటేశం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన రాయికోడ్ మండల ఎంపిడివోగా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే సిబ్బందితో సమావేవం ఏర్పాటు చేసి గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న క్రీడామైదనాలు, ప్రకృతివనాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హరితహారం, ఉపాధిహామి, నర్సరీల పెంపకం, పారిశుధ్యం తదితర విషయాలపై ప్రధాన చోరవ తీసుకుంటానని ఆయన అన్నారు. ఇజిఎస్ ఎపివో యాదగిరి, సూపరిండెంట్ రామలింగం పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ అధ్యక్షునిగా శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

**గుమ్మడిదల, నవంబర్ 10, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ గుమ్మడిదల అధ్యక్షునిగా మూడోసారి పి శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా ఉపాధ్యక్షులుగా ఎస్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్‌రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని ఆయన అన్నారు.

### అత్యుత్తమ వృద్ధిని నమోదు చేసిన కేఎస్టీ

సెప్టెంబర్‌లో ముగిసిన త్రైమాసికంలో కేఎస్టీ లిమిటెడ్ అత్యుత్తమ వృద్ధిని నమోదు చేసిందని సంస్థ ప్రకటించింది. ఈ త్రైమాసికం లో రూ.4,313 మిలియన్ల అమ్మకాలు జరిగాయని, ఈ విలువ గత సంవత్సరం కంటే 17 శాతం పెరిగిందని సంస్థ ప్రక టించింది. ఈ ఏడాది త్రైమాసికాల్లో అమ్మకాల విలువ రూ. 12.974 మిలి యన్లు. ఇది గత సంవత్సరం ఇదే కాలం కంటే దాదాపు 23 శాతం పెరిగింది. త్రైమాసికానికి 13 ఆర్వోఎస్‌ను సంస్థ సాధించింది.